## క్లుప్తంగా

### దేశం కోసం జీవించాలి



లింగంపేట: ప్రతి ఒక్కరూ దేశం కోసం జీవించాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్న పాఠశాలలో మూడు రోజుల ప్రారంభిక శిక్షావర్గా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శాఖకు వెళ్లే స్వయం సేవకులకు నైతిక, మానవతా విలువలు పెరుగుతాయన్నారు. దేశ భక్తి, జాతీయ భావం వృద్ధి చెందుతుందని, క్రమశిక్షణ, సేవా గుణం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ్ ప్రచారక్‌లు, యువకులు పాల్గొన్నారు.

### బోర్డును సరిచేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డుపై తప్పుగా ఉన్న పౌర సమాచార అధికారి పేరును కార్యాలయ సిబ్బంది సరిచేశారు. 'సాక్షి' దిన పత్రికలో గురువారం ప్రచురితమైన 'అధికారి మారినా పాత పేరే..' అనే వార్తకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్‌పటేల్, కార్యాలయ సిబ్బంది స్పందించారు. బోర్డుపై గతంలో పని చేసిన మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీకాంత్ పేరును తొలగించి ప్రస్తుతం ఉన్న రమేశ్ పేరును బోర్డుపై రాయించారు.

### కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్



లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ నెల 30 వరకు క్యాంప్ కొనసాగుతుందని ఎంఈవో శౌకత్‌అలీ తెలిపారు. ఇందులో భాగంగా వాలీబాల్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి 120 మంది విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నారు. సమన్వయకర్త వహీద్‌సిద్దిఖీ, యూసుఫ్, సాయిరాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. భారత సైనికులు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా వారు సంఘీభావం తెలిపారు. దీనిలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కుడుముల సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, సామెల్, విద్యాసాగర్, అజర్, శేకావత్, చెన్న లక్ష్మణ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

### సమావేశాన్ని విజయవంతం చేయాలి



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు పార్టీ కార్యకర్తల సమావేశం ఉంటుందని దీనిని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారని అన్నారు. సమావేశంలో నాయకులు మల్లయ్యగారి ఆకాశ్, తోట రాజు, కొరమండల్ సాయాగౌడ్, గంజి హన్మాండ్లు ఉన్నారు.

### సాయి ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న షిరిడి సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఖాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ చేపట్టారు.

# గుంతల రోడ్డుతో నరకయాతన

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





గుంతల మయంగా మారిన వెల్లుట్ల రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మారెడ్డి–వెల్లుట్లకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల మరమ్మతులకు సంబంధించి మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్డు కింద నిధులు మంజూరైనా రోడ్డు ప్యాచ్ వర్కుకు సంబంధించిన పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాక పోవడంతో పనులు జరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాలు పాడవుతున్నాయి. తిమ్మారెడ్డి ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తండా, వెల్లుట్ల వరకు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు గుంతల మయంగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమారుల అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

#### గుంతలను పూడ్చాలి



తిమ్మారెడ్డి మీదుగా వెంకటాపూర్ వెళ్లే దారి గుంతల మయంగా ఉంది. దీంతో ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నాం. బైక్‌పై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి. – జీవన్, వెంకటాపూర్

#### పనులు చేపట్టాలి



తిమ్మారెడ్డి నుంచి వెల్లుట్ల వరకు వెళ్లే దారికి సంబంధించి గుంతలు బాగా ఉన్నాయి. దీంతో వాహనాలు పాడవుతున్నాయి. ఆటోలు సైతం పాడవడంతో వారు ఈ రోడ్డు వెంట రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులు చేపట్టాలి. – నజీర్, వెల్లుట్ల

#### మరమ్మతులు చేయిస్తాం

తిమ్మారెడ్డి గేట్ నుంచి వెల్లుట్ల వరకు ఉన్న బీటీ రోడ్డుకు సంబంధించి ప్యాచ్ వర్కులకు మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్డు (ఎంఆర్ఆర్)కింద మెయింటెనెన్సు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. – గిరిధర్, డీఈ, పంచాయతీరాజ్, ఎల్లారెడ్డి

## సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఖాతాదారులకు పోలీసు కళాబృందం సభ్యులు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, ఇతర వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మహేశ్, కళాబృందం సభ్యులు ప్రభాకర్, పోలీసు సిబ్బంది సిద్దిఖీ, పెంటయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం

**లింగంపేటలో..**

లింగంపేట: లింగంపేట మండల కేంద్రంలోని బస్టాండ్‌లో పోలీస్ కళాబృందం సభ్యులు గురువారం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అపరిచితులకు తమ ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు ఇవ్వద్దన్నారు. బస్సు ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా క్రికెట్ మ్యాచ్



మద్నూర్: మండల కేంద్రంలో గురువారం శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మద్నూర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ నెల 10 వరకు ప్రతి రోజు సాయంత్రం మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తామని అన్నారు.

### 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక



బాన్సువాడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గ్రామాల్లో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రారంభించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులతో మాట్లాడి నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. విడతల వారిగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ. ఐదు లక్షల నగదు జమ అవుతాయని వివరించారు. ఎంపిక చేసిన లబ్ధిదారులు త్వరగా పనులను ప్రారంభించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేస్తామని అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### గ్రామసంఘాల ఆడిట్ నిర్వహణ



నాగిరెడ్డిపేట: మండల సమాఖ్యతోపాటు మండలంలోని గ్రామసంఘాలకు సంబంధించి గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అశోక్‌రెడ్డి అసోసియేట్ అండ్ టీం సభ్యులు ఆడిట్ చేశారు. ఆడిట్ నివేదికను పది రోజుల్లో జిల్లా కార్యాలయానికి పంపిస్తామని ఆడిటర్ అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, ఏపీఎం జగదీశ్ కుమార్, ఆడిట్ బృందం సభ్యులు శివ, రాజేశ్, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### 'ఆపరేషన్ సిందూర్'పై హర్షం



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని భిక్కనూర్ గ్రామంలో ఉపాధి హామీ సిబ్బంది భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేశారు. జాతీయ జెండాలను చేతబట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### హోరాహోరీగా కుస్తీ పోటీలు



నిజాంసాగర్: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహించారు. మండల శివారులో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలకు పొరుగు రాష్ట్రాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. కుస్తీ పోటీలు హోరా హోరీగా సాగాయి. అనంతరం గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

కామారెడ్డి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించి మద్దతు ధర పొందాలని సింగిల్ విండో డైరెక్టర్ బక్కన్నగారి రాజు అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ముల్క రాజు, బక్కన్నగారి హన్మాండ్లు, సాయిలు, గోపాల్, శ్రీనివాస్, మారుతి, ప్రవీణ్, రంజిత్, నర్సింలు, శేఖర్, రాజయ్య, సతీశ్, మోహన్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్

### సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

సదాశివనగర్: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఎస్సై రంజిత్ అన్నారు. గురువారం మండలంలోని కుప్రియాల్ జీపీలో గ్రామ పెద్దలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కుప్రియాల్‌లో గ్రామపెద్దలతో చర్చిస్తున్న ఎస్సై

**దోమకొండలో..**

దోమకొండ: ఆలయాల్లో దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్సై స్రవంతి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై జాబీ బాషా, ఆలయ కమిటీ అధ్యక్షుడు మ్యాక నాగరాజు, బొమ్మెర గంగాధర్, గణేశ్, సిబ్బంది ఉన్నారు.

### రేపు బాలల వేసవి శిబిరం

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓంశాంతి కేంద్రంలో ఈనెల 10న బాలల వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జయదీది గురువారం తెలిపారు. 7 నుంచి 12 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. సభ్యత–సంస్కృతి, విజయానికి టిప్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, ఫన్ గేమ్స్, మానసిక వికాసం, సెల్‌ఫోన్ డీ అడిక్షన్, ధ్యానం, సమాజంలో కోల్పోతున్న ప్రేమానురాగాలు అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు.

## సంక్షిప్తం

### తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేయాలి



కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, దాతలు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు అన్నారు. తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంఏ రషీద్, అధ్యాపకులు కిషన్, నర్సింలు, బాపురావు, రక్తదాతలు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పూర్తయిన వారు దోస్త్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులు ఉన్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### చురుగ్గా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లు



బాన్సువాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లను గురువారం మండలంలోని కోనాపూర్‌లో చేపట్టినట్లు క్లస్టర్ ఏఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. డిజిటల్ గుర్తింపు కార్డులను జారీ చేసేందుకు వివరాలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 11 నంబర్ల ఐడీలో రైతుపేరు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, పాస్‌బుక్ వివరాలు, భూమి రకం, సర్వే నంబర్లు, సాగుచేసిన పంట వివరాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన కిసాన్ సమ్మాన్‌నిధి, ఫసల్‌బీమా యోజన, హెల్త్‌కార్డులకు వివరాల నమోదు తప్పని సరి అని అన్నారు. రైతులు వివరాలను తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

### బ్యాంక్ లింకేజీ తీసేయాలి

తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధి పథకంలో భాగంగా చేపడుతున్న రాజీవ్ యువ వికాస్ బ్యాంకు లింకేజీని తీసేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఆయన గురువారం తాడ్వాయిలో విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు లింకేజీతో కూడిన స్కోర్ విధానాన్ని తప్పనిసరిగా నిబంధనల్లో చేర్చడం వల్ల లక్షల మంది నిరుపేద యువకులు అవకాశాన్ని కోల్పోతారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బ్యాంక్ లింకేజీ లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేసి నేరుగా రుణాలు అందించాలని కోరారు.

## కామారెడ్డికి తాగు, సాగునీటిని అందిస్తాం

దోమకొండ: కామారెడ్డి ప్రాంతానికి తాగు, సాగునీటిని అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. భిక్కనూరు సమీపంలోని తన ఫాంహౌస్‌లో దోమకొండ మండల నాయకులతో గురువారం మాట్లాడారు. ప్రాణహిత చేవేళ్ల పథకం 22వ ప్యాకేజీ ద్వారా కామారెడ్డి ప్రాంతానికి సాగు, తాగునీటిని అందిస్తామన్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు కేటాయించిందని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం దోమకొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్‌అలీని సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజిరెడ్డి, తిర్మల్‌గౌడ్, అనంతరెడ్డి, నాయకులు సీతారాం మధు, నిమ్మ బాల్‌రాజ్, పిస్నం నాగేంద్రవర్మ, సుతారి రమేశ్ పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

### విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థులను, ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం తన చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి దయానంద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లలో గురువారం పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించే పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ సాయిలు, గ్రామ పెద్దలు అంజయ్య, సంతోష్ భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు.

## ధాన్యం తరలించేలా చర్యలు



దోమకొండ: సంఘమేశ్వర్‌లో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజయ్‌రావు



ఎల్లారెడ్డి: గండిమాసానిపేటలో వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్

దోమకొండ: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం త్వరగా తరలించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. గురువారం దోమకొండ మండలంలోని సంఘమేశ్వర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. లారీల కొరతతో ధాన్యం సరఫరాలో ఆలస్యం జరుగుతుందని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే దోమకొండ సింగిల్‌విండో కార్యదర్శి బాల్‌రెడ్డితో పాటు సివిల్ సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**కొనుగోళ్లను వేగవంతం చేయాలి**

ఎల్లారెడ్డి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేటలో గురువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణాను వెంటవెంటనే చేపట్టాలన్నారు. గిర్దావార్ శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### చిన్నారులకు కంటి పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామంలో గురువారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులకు ఆప్తాల్మిక్ వైద్యుడు హరికిషన్ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంజయ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల పరిశీలన



సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. కూలీలకు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీవో శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిత, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బీసీలంతా ఐక్యం కావాలి

రామారెడ్డి: బీసీలంతా ఐక్యం కావాలని మన ఆలోచన సాధన సమితి అధ్యక్షుడు కటకం నర్సింగరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మన ఆలోచన పేరుతో తొమ్మిది నెలలుగా వివిధ వర్గాలు, సంఘాలు, మహిళలు, మేధావులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన రమేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా బీసీలను ఐక్యం చేయడానికి గ్రామ బాట పట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టిగారి విజయ్, నామాల యాదగిరి, పిప్పరి లింబాద్రి, శ్రీనివాస్, గంగాధర్, పరమేశ్ పాల్గొన్నారు.



రామారెడ్డిలో మాట్లాడుతున్న నర్సింగరావు

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్‌లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవ్‌కుమార్, సంగయ్య, సూఫీ, హన్మంత్‌రెడ్డి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి జన్మదిన వేడుకలు



కామారెడ్డి క్రైం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డీటీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ సభ్యుడు ఇజాజ్ అహ్మద్, ఎంవీఐ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.